ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో...

7న అమలాపురంలో ముత్యాల ముగ్గుల పోటీలు

అమలాపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నల్లవంతెన దిగువన కలెక్టర్ కార్యాలయం పక్కన గల జీఎంసీ బాలయోగి స్టేడియంలో "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" ఈ నెల 7వ తేదీ ఆదివారం జరగనున్నాయి. జిల్లా పోటీలకు స్పాన్సరర్‌గా అమలాపురానికి చెందిన టీడీపీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి జీఎం హరీష్ బాలయోగి వ్యవహరిస్తున్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ముత్యాల ముగ్గుల పోటీలు ప్రారంభమవుతాయి. జిల్లా నలుమూలల నుంచి మహిళలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. విజేతలైన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలవారికి రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు చొప్పున నగదు బహుమతులు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే మహిళలు పేర్ల నమోదుకు 99854 11256, 99854 11015 నెంబర్లను సంప్రదించగలరు.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

జలజీవన్ మిషన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు ఉద్దేశించిన జలజీవన్ మిషన్ పథకాన్ని సమర్థవంతంగా అమలుచేస్తూ లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. తొలుత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అమరావతి నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రజలకు అందించేందుకు ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన ప్రోత్సాహకాలు గర్భిణులకు అందిస్తూ సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, సీపీవో వెంకటేశ్వర్లు, డీపీవో వి.కృష్ణకుమారి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకర ప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



మూణ్ణాళ్లకే ముక్కలు!

- కొత్తపేట మండల పరిషత్ అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలు
- ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణాలోపం
- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- పాడవుతున్న సీసీ రోడ్లు
- రూ.కోటి ప్రజా ధనం దుర్వినియోగం

కొత్తపేట, జనవరి 4: కొత్తపేట మండలంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలు ప్రస్ఫుటమవుతున్నాయి. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణాలోపంతో నామినేషన్ పద్ధతిలో వచ్చిన కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. వేసిన రోడ్లు మూణ్ణాళ్లకే ముక్కలవ్వడంతో సుమారు రూ.కోటి ప్రజా ధనం దుర్వినియోగమైందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలు ఇలా వున్నాయి... కొత్తపేట మండల పరిషత్‌కు 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.1.20 కోట్లు విడుదలయ్యాయి. పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టు రిపేర్లు, సామాజిక భవనాల రిపేర్లు, మండల పరిషత్ కార్యాలయ రిపేర్లతో పాటు మోటారు బోర్లు వంటి సుమారు 56 పనులను రూ.93 లక్షల వ్యయంతో చేపట్టి పూర్తి చేశారు. మిగిలిన నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు ప్రారంభించగా అవి నిర్మాణ దశలో ఉన్నాయి.

పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల్లో ఎస్టిమేట్‌లో వున్నట్టు పొడవు, వెడల్పు సరిపెట్టి గ్రావెల్ ఫిల్లింగ్, టోన్‌డస్ట్ ఫిల్లింగ్‌లో తేడాలు చేశారు. కావాల్సిన మందం, రోలింగ్, కాంపాక్ట్ డెన్సిటీపై దృష్టి పెట్టకపోవడంతో అవి వేసిన వెంటనే పగుళ్లు తీసి విరిగిపోతున్నాయని జనం గగ్గోలు పెడుతున్నారు. డ్రైనేజీ నిర్మాణంలో శాండ్ ఫిల్లింగ్, మాస్ కాంక్రీట్, సైడ్ వాల్స్ వెడల్పును అంచనాలతో సంబంధం లేకుండా నిర్మించారని, సామాజిక కార్యాలయాల రిపేర్లలో చేసిన వాటి కన్నా అధికంగా బిల్లులు చేయించుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నామినేషన్ పద్ధతిలో వచ్చిన కాంట్రాక్టర్లు అధికార, రాజకీయ బలంతో వారు వేసిందే రోడ్డు, చేసిందే పని అన్నట్టు సాగిపోయిందని పలువురు చర్చించుకుంటున్నారు. కొత్తపేట, వానపల్లి, కండ్రిగ, గంటి గ్రామాల్లో చేపట్టిన పనుల నాణ్యతను ప్రశ్నించడంతో పాటు కొన్నింటిని అధికారుల పైరవీలతో మండలం, పంచాయతీ పరిధిల్లో రెండుచోట్ల చేసినట్టు రికార్డింగ్ చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించి విచారణ చేపడితే వాస్తవాలు వెలుగు చూస్తాయని ప్రజలు చెప్తున్నారు.



సైడ్‌వాల్స్ నాణ్యతా లోపాలతో నిర్మించిన డ్రైనేజీ



కోర్టు ప్రాంగణం ఎదుట న్యాయవాదుల సమ్మె శిబిరంలో కూర్చున్న మాజీ ఎమ్మెల్యే ఆనందరావు

భూ రక్షణ చట్టాన్ని రద్దు చేయాలి

అమలాపురం టౌన్, జనవరి 4: కమిటీలతో కాలయాపన చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజల ఆస్తులకు రక్షణ లేని 27/2023 భూ రక్షణ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు డిమాండు చేశారు. అమలాపురం కోర్టు సముదాయం ఎదుట న్యాయవాదులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని గురువారం ఆయన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుతో కలిసి సందర్శించి మాట్లాడారు. నాగాబత్తుల శ్రీనివాస్, సాధనాల రాంబాబు, గంధం శ్రీను తదితరులు సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరంలో న్యాయవాదులు నల్లా రవిప్రసాద్, శ్రీనివాస్, గీత, భార్గవి, బి.లావణ్య, ఎం.ఆదినారాయణరావు, ప్రసాద్, మల్లికార్జునరావు పాల్గొన్నారు. శిబిరాన్ని బార్ అసోసియేషన్ ప్రతినిధులు యూపీ లక్ష్మణరావు, బాబి, పర్వతం సూర్యప్రకాశరావు, ఎండీ ఆజామ్, పినిపే రాధాకృష్ణ, బడుగు భాస్కరజోగేష్, మాకిరెడ్డి ఆదినారాయణ తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి హుండీల ఆదాయం రూ.47 లక్షలు

- 7లో



లూయి బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అంధుల ఆరాధ్య దైవం లూయీ బ్రెయిలీ

అమలాపురం టౌన్, జనవరి 4: అంధుల కోసం ప్రత్యేక లిపి సృష్టించిన లూయి బ్రెయిలీ వారి ఆరాధ్య దైవంగా గుర్తింపు పొందారని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. గురువారం ప్రపంచ అంధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని లూయి బ్రెయిలీ జయంతిని కలెక్టరేట్‌లో నిర్వహించారు. సమాజంలో దురదృష్టవశాత్తు కొందరు విధి వంచనకు గురై అంధులయ్యారన్నారు. వారు నిరాశ, నిస్పృహలతో కుంగి పోకుండా వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు బ్రెయిలీ ఎంతో కృషి చేశారని వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది శ్రీరామ్ పాల్గొన్నారు.

16వ రోజుకు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

ముమ్మిడివరం, జనవరి 4: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె గురువారం 16వ రోజుకు చేరుకుంది. ఆ ప్రాజెక్టులోని ఏడు విభాగాల ఉద్యోగులు ముమ్మిడివరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తమ సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండు చేశారు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు ప్రతినెలా సక్రమంగా వేతనాలు అందట్లేదని, రెండు నెలలుగా కేంద్ర ప్రభుత్వ నిధులు కేటాయించినా రాష్ట్ర ప్రభుత్వం వాటిని వేరే వాటికి దారి మరల్చడంతో వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నామన్నారు. వేతన బకాయిలను తక్షణం విడుదల చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ, కనీస వేతనం చట్టం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగ విరమణ అనంతరం అన్ని సదుపాయాలు కల్పించాలని డిమాండు చేశారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘాలు శిబిరాన్ని సందర్శించి సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు అప్పారెడ్డి, ఉండ్రు ముసలయ్య, గణేష్, యూటీఎఫ్ ఉద్యోగ సంఘ నాయకులు, సీఐటీయూ, ఎస్టీయూ, జేఏసీ నాయకులు శిబిరాన్ని సందర్శించారు. శిబిరంలో సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనుబాబు, కార్యదర్శి ఎన్.వెంకట్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ల సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, ఐఈఆర్టీల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, రిసోర్సుపర్సన్ల డివిజన్ అధ్యక్షుడు నాగన్న, కంప్యూటర్ ఆపరేటర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యా శాఖ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో ఉద్యోగులు



జర్నలిస్టు హౌసింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

జర్నలిస్టులు కోరిన ప్రాంతాల్లో స్థల సేకరణ

అమలాపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.535 జారీ చేసిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. జర్నలిస్టులు కోరిన ప్రాంతాల్లో స్థల సేకరణ చేసేలా అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీవోలకు ఆయన పలు సూచనలు చేశారు. జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్ కింద అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులకు కావాల్సిన భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని ఆర్డీవోలను ఆయన ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా జర్నలిస్టు హౌసింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆన్‌లైన్ వెరిఫికేషన్ ద్వారా ఇప్పటివరకు ఇళ్ల స్థలాల కోసం 212 దరఖాస్తులు కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చాయన్నారు. వీటిలో అమలాపురం డివిజన్‌కు సంబంధించి 114, కొత్తపేట 45, రామచంద్రపురం 46 దరఖాస్తులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన ఏడు దరఖాస్తులు అందాయన్నారు. స్థల సేకరణ విషయంలో జర్నలిస్టులు కోరిన విధంగా ఉండాలని ఆర్డీవోలను ఆదేశించారు. కమిటీ సభ్యులైన డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవోలు జి.కేశవర్ధనరెడ్డి, ఎం.ముక్కంటి, ఎస్.సుధాసాగర్, సీహెచ్‌వీవీ సూర్యనారాయణరాజు, డి.సాయి మెహర్, ఏఎస్ ప్రసాదరావు, కమిటీ కన్వీనర్, జిల్లా సమాచార-పౌర సంబంధాల అధికారి కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



యాగంలో పాల్గొన్న చైతన్యరాజు, బాపిరాజు దంపతులు

శ్రీవారి వైభవోత్సవం

గైట్‌లో ఘనంగా ప్రారంభమైన చతుర్వేద మహాయాగం



రాజానగరం, జనవరి 4: లోక కల్యాణం, విశ్వశాంతిని కాంక్షిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వ ర్యంలో గైట్ ప్రాంగణంలో గురువారం శ్రీవారి వైభవోత్సవం, చతుర్వేద మహాయాగం వైభవోపేతంగా నిర్వహించారు. చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్య నారాయణరాజు (చైతన్యరాజు) దంపతులు, కిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ రవికిరణ్‌వర్మ దంపతులు, గైట్ మేనేజింగ్ డైరెక్టర్ శశికిరణ్ వర్మ దంపతులు, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీవారి వైభవోత్సవం, చతుర్వేత మహా యాగాలను ప్రారంభించారు. అనంతరం స్వామివారికి సుప్రభాతం, తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్ర నామార్చన, నివేదనము, సర్వ దర్శనం, తిరుప్పావడ సేవతో పాటు శ్రీవారి కల్యాణోత్సవం కన్నుల పండువగా తిరుపతి వైఖానస ఆగమ పండితులు దీవి బాలాజీ రంగాచార్యులు పర్యవేక్షణలో అంగరంగ వైభ వంగా జరిపించారు. అలాగే సాయంత్రం నుంచి స్వామివారి సర్వ దర్శనం, శుద్ధి ఏకాంత సేవా కార్య క్రమాలు నిర్వహించారు. అన్నవరం, ద్వారకా తిరుమల నుంచి వచ్చిన రథాలతో కొలువైన సత్యదేవుడు, శ్రీవేంకటేశ్వరస్వామికి కూడా ఆయా ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో ద్వాదశి జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బైర్రాజు ప్రసాదరాజు, మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, ప్రముఖులు డీబీవీ రాజు, కేశవరాజు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

నేటి నుంచే గైట్ ప్రాంగణంలో తెలుగు మహాసభలు



ప్రత్యేక అలంకరణలు

రాజానగరం, జనవరి 4: చైతన్య విద్యా సంస్థలు, ఆంధ్ర సారస్వత పరిషత్ సంయుక్తంగా గైట్ ప్రాంగణంలో తలపెట్టిన అంతర్జాతీయ తెలుగు మహా సభలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీరాజరాజ నరేంద్రుల పట్టాభిషిక్త సహస్రాబ్ది ఉత్సవాలు నీరాజనంగా నన్నయ భట్టారకుని మహాభారతం వెయ్యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అంతర్జాతీయ తెలుగు మహా సభలను రాజమహేంద్రవరం వేదికగా గైట్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు గజల్ శ్రీనివాస్ తెలిపారు. మూడు రోజులు పాటు తెలుగు మహాసభలు జరుగు తాయన్నారు. దీనిలో భాగంగా గైట్ ప్రాంగణంలో రాజరాజ నరేంద్రుని వేదికతో పాటు గైట్ డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలలో నారాయణభట్టు వేదిక, ఆదికవి నన్నయ్య వేదికలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

కొలువుదీరిన మహనీయుల విగ్రహాలు









రాజానగరం, జనవరి 4: అంతర్జాతీయ తెలుగు మహాసభలను పురస్కరించుకుని గైట్ ప్రాంగణంలోని ప్రధాన వేదికల వద్ద ఏర్పాటు చేసిన ప్రముఖుల విగ్రహాలు జీవకళ ఉట్టిపడుతూ చూపరులను ఇట్టే కట్టిపడేస్తున్నాయి. గైట్ ప్రాంగణంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న అంతర్జాతీయ తెలుగు మహా సభల ప్రధాన వేదిక వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రముఖుల విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. తెలుగు భాషకు శోభనద్దిన ప్రముఖుల విగ్రహాలు అంతర్జాతీయ తెలుగు మహాసభల ప్రధాన వేదిక వద్ద కొత్త అందాలను తెచ్చిపెడుతున్నాయి. విద్యార్థులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చినవారంతా ఆయా విగ్రహాల వద్ద నిలబడి ఫొటో తీసుకుంటున్నారు. గోదావరి ప్రాంత అన్నదాతల ఆరాధ్య దైవంగా భావించే సర్ ఆర్థర్ కాటన్, ఎంఎస్ సుబ్బలక్ష్మి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, సంఘ సంస్కర్త వీరేశలింగం పంతులు, కవయిత్రి మొల్ల విగ్రహాలు జీవకళతో ఉట్టిపడుతున్నాయి.

కోరికలు దుఃఖానికి మూలం

ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు



అనపర్తి, జనవరి 4: కోరికలు దుఃఖానికి మూలమని నియమబద్ధంగా జీవితాన్ని గడిపేవారు, ధర్మాన్ని ఆచరించే వారు జన్మరాహిత్యాన్ని పొందుతారని మహా సహస్రావధాని గరికపాటి నరసింహారావు అన్నారు. అనపర్తిలోని టీటీడీ కల్యాణ మండపంలో శ్రీ శారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాలలో భాగంగా మూడో రోజైన గురువారం త్యాగమూర్తి కుంతి అంశంపై ఆయన ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మహాభారత పాత్రల విశ్లేషణ త్యాగమూర్తి కుంతీదేవిపై తనదైన శైలిలో చమత్కారాలు, చలోక్తులతో ఆధ్యాత్మిక ప్రవచనం సాగింది. ఈ కార్యక్రమంలో మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, ఆధ్యాత్మికవేత్త రెడ్డి సురేష్‌శర్మ, కొవ్వూరి రఘునాథరెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, సత్తి రామారెడ్డి, కర్రి వెంకట రామకృష్ణారెడ్డి, బచ్చు వీరవెంకటరమణ, లింగం ఫణికుమార్, మేడపాటి చెల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యనమదల మురళీకృష్ణకు మధునాపంతుల పురస్కారం



కార్పొరేషన్(కాకినాడ), జనవరి 4: ఆయుర్వేద ఆచార్య, భాషా ప్రవీణ మధునాపంతుల సూరయ్యశాస్త్రి శత జయంతి సందర్భంగా కాకినాడకు చెందిన ప్రముఖ సాంక్రమిక వైద్య నిపుణులు డాక్టర్ యనమదల మురళీకృష్ణకు ప్రతిభా పురస్కారం ప్రదానం చేయనున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలంలోని పల్లిపాలెం గ్రామానికి చెందిన మధునాపంతుల సూరయ్యశాస్త్రి ఆయుర్వేద వైద్యుడిగా కవిగా, పండితుడిగా ప్రఖ్యాతిగాంచారు. తన శిష్యులను చాలామందిని ఉన్నత, ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దారు. ఆయుర్వేద వైద్యుడిగా ప్రత్యేకించి దీర్ఘకాల క్లిష్టమైన రోగాలకు చికిత్సను అందింది ఎందరినో స్వస్థపరిచారు. ఆయన శత జయంతి ఉత్సవం సందర్భంగా ఈనెల 14న పల్లిపాలెంలోని మధునాపంతుల కామరాజు సాంస్కృతిక ప్రాంగణంలో నిర్వహించే కార్యక్రమంలో డాక్టర్ యనమదల మురళీకృష్ణను ప్రతిభా పురస్కారంతో సత్కరించనున్నట్లు మధునాపంతుల సత్యనారాయణమూర్తి తెలిపారు. ఇటీవల కొవిడ్ సమయంలోను, గతంలో ఎయిడ్స్ బాధితుల గురించి సాధికారమైన వైద్య విజ్ఞానాన్ని విస్తృతంగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చి ప్రజల్లో భరోసా నింపినందుకుగాను ఆయనను ఈ ప్రతిభా పురస్కారంతో గౌరవిస్తున్నట్లు తెలిపారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు



సామర్లకోట, జనవరి 4: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ సెక్షన్ పరిధిలో సామర్లకోట మీదుగా ఎనిమిది సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపనున్నట్లు రైల్వే ఉన్నతాధికారి కార్యాలయం నుంచి గురువారం రాత్రి సమాచారం అందింది. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారి నుంచి ఆంధ్రజ్యోతి సమాచారాన్ని సేకరించింది.

07027 నంబరు గల హైద్రాబాద్- బెరహమ్‌పూర్ మధ్య రాకపోకలు సాగించేందుకు సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 13 తేదీ శనివారం ఒక ట్రిప్ బయలుదేరనుంది. ఈ రైలు శనివారం హైద్రాబాద్‌లో రాత్రి 10.40 నిమిషాలకు బయలుదేరి శనివారం సాయంత్రం 3.15 గంటలకు బెరహమ్‌పూర్ చేరుకుంటుంది. మార్గమధ్యంలో జనగాం, ఖాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, కొండపల్లి, రాయనపాడు, ఏలూరు, నిడదవోలు, రాజమండ్రి మీదుగా సామర్లకోటకు ఉదయం 8.13కి చేరుకుని అన్నవరం 8.45కి చేరుకుని అనకాపల్లి మీదుగా బెరహమ్‌పూర్‌కు ఆదివారం సాయంత్రం 3.15కి వెళుతుంది.

07028 నంబరు గల బెరహమ్‌పూర్-హైద్రాబాద్ మధ్య సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం జనవరి 14 తేదీ సాయంత్రం 6.00కి బయలుదేరి దువ్వాడకు రాత్రి 11.30కి చేరుకుంటుంది. అన్నవరానికి అర్ధరాత్రి 12.43కి చేరుకుంటుందని, సామర్లకోటకు రాత్రి 1.23కి చేరుకుంటుందన్నారు. రాజమండ్రి, నిడదవోలు, ఏలూరు, రాయనపాడు, ఖమ్మం, వరంగల్, జనగాం, సికింద్రాబాద్ మీదుగా హైద్రాబాద్‌కు సోమవారం ఉదయం 11.30 గంటలకు చేరుకుంటుంది.

07022 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు కాకినాడ-సికింద్రాబాద్ మధ్య జనవరి 12న శుక్రవారం సాయంత్రం 5.40కి బయలుదేరనుంది. ఈ రైలు సామర్లకోటకు రాత్రి 6.10కి చేరుకుంటుంది. అనపర్తికి 6.30కి చేరుకుని రాజమండ్రికి రాత్రి 6.50కి చేరుకుంటుంది. నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, రాయనపాడు, కొండపల్లి, ఖమ్మం, వరంగల్, ఖాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు శనివారం తెల్లవారుజామున 5.55కి చేరుకుంటుంది.

07221 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్-కాకినాడ మధ్య జనవరి 11న గురువారం రాత్రి 9 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరనుంది. ఈ రైలు ఖాజీపేట, వరంగల్, ఖమ్మం, కొండపల్లి, రాయనపాడు, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు మీదుగా రాజమండ్రికి శుక్రవారం ఉదయం 6.10కి చేరుకుని, అనపర్తికి 6.30కి, సామర్లకోటకు 6.50కి, కాకినాడకు 8 గంటలకు చేరుకుంటుంది.

07025 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్-బెరహమ్‌పూర్ మధ్య జనవరి 12,19 తేదీలలో ప్రతీ శుక్రవారాలలో బయలుదేరనున్నాయి. ఈ రైలు శుక్రవారం రాత్రి 7.45కి సికింద్రాబాద్‌లో బయలుదేరి పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా రాజమండ్రికి శనివారం తెల్లవారుజామున 3.08కి చేరుకుని, సామర్లకోటకు 3.45కి చేరుకుంటుంది. అన్నవరం, అనకాపల్లి, పెందుర్తి, విజయనగరం, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం మీదుగా బెరహమ్‌పూర్‌కు శనివారం ఉదయం 11.15కి చేరుకుంటుంది.

07026 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు బెరహమ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య జనవరి 13,20 తేదీలలో ప్రతీ శనివారాలలో మధ్యాహ్నం 12.30కి బయలుదేరనున్నాయి. ఈ రైలు బెరహమ్‌పూర్‌లో మధ్యాహ్నం 12.30కి బయలుదేరి ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, విజయనగరం, పెందుర్తి, అనకాపల్లి మీదుగా అన్నవరానికి సాయంత్రం 6.23కి చేరుకుని సామర్లకోటకు రాత్రి 7.08కి చేరుకుంటుంది. రాజమండ్రికి రాత్రి 7.55కి చేరుకుని తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, మిర్యాలగూడ, నల్గొండ, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు ఆదివారం ఉదయం 6.30కి చేరుకుంటుంది. మరిన్ని వివరాలకు, రైలు రిజర్వేషన్ టిక్కెట్లకు సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయాల వద్ద సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారి అందించిన సమాచారంలో తెలిపారు.

అంతర్వేది లక్ష్మీనరసింహుడి ఆదాయం రూ.47 లక్షలు



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అంతర్వేది, జనవరి 4: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం హుండీలను తెరిచి కానుకలను లెక్కించారు. 98 రోజులకు ప్రధాన హుండీ, గుర్రాలక్కమ్మ హుండీల ఆదాయం రూ.46,08,255, అన్నదానం హుండీ ఆదాయం రూ.91,805 వచ్చింది. హుండీల ద్వారా మొత్తం రూ.47,00,060 ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఏసీ కేఎస్వీవీ ప్రసాద్, తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

8న అప్రంటీస్ మేళా

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 4: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ కంపెనీల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి ఈనెల 8న ప్రైమినిస్టర్ నేషనల్ అప్రంటీస్ మేళా-24 నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంఈవీ వర్మ తెలిపారు. జిల్లాలోని ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్‌మెంట్, స్టాఫ్ వచ్చి వారికి కావాల్సిన అప్రంటీస్ ట్రైనీస్‌ను ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లోని వివిధ ట్రేడ్‌ల్లో ట్రైనింగ్ పూర్తి చేసిన ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 8639230775 నెంబరును సంప్రదించాలన్నారు.

పాత సామాన్ల దుకాణంలో అగ్నిప్రమాదం

రూ.2 లక్షల ఆస్తినష్టం

కాకినాడ క్రైం, జనవరి 4: ఓ పాత సామాన్ల దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించి రూ.2లక్షల మేర ఆస్తినష్టం జరిగింది. ఈ ప్రమాదం కాకినాడలో గురువారం జరిగింది. రేచర్లపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సి)కి సమీపంలో జాకీర్ హుస్సేన్ అనే వ్యక్తి నిర్వహిస్తున్న పాత సామాన్ల (స్క్రాప్) దుకాణంలో గురువారం రాగిని వేరు చేసే క్రమంలో వైర్లు కాల్చుతూ అక్కడ పనిచేసే వ్యక్తులు మంటను ఆపకుండా మార్చిపోయి బయటకు వెళ్లారు. దీంతో గాలి అధికమవ్వడంతో మంటలు ఎగిసిపడి అగ్నికీలలు దావానంలా వ్యాపించాయి. ఈ క్రమంలో దుకాణం అగ్నికి ఆహుతి అయ్యింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సాలిపేట అగ్నిమాపకాధికారి బి.ఏసుబాబు తన సిబ్బంది, శకటంతో హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన సమయానికి సంఘటనా స్థలంలో ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టయ్యింది. అగ్నిమాపక సిబ్బందికి, స్థానికులు సహకరించడంతో మంటలు మరింత వ్యాప్తి చెందకుండా నిలువరింపజేయగలిగారు.

కొండరెడ్ల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన

కేంద్ర ప్రభుత్వ మోటా డిప్యూటీ కార్యదర్శి మనోజ్‌కుమార్



మాట్లాడుతున్న మనోజ్‌కుమార్

రంపచోడవరం, జనవరి 4: ఏజెన్సీలో నిరుపేద కొండరెడ్లకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వ మోటా డిప్యూటీ కార్యదర్శి మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, రాష్ట్ర ట్రైకార్ జనరల్ మేనేజర్ మణికుమార్‌తో కలిసి మండలంలోని కొయ్యలగూడెం గ్రామంలో పర్యటించారు. జన్మన్ పథకం ద్వారా కొండరెడ్లకు గృహాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ కొండరెడ్లకు సంబంధించి సర్వే జరుపుతున్నామన్నారు. అనంతరం ఐఈసీ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావు, ఎంపీడీవో హరికృష్ణ, ఎంపీటీసీ నర్రి పాపారావు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులకు చేసిందేమీలేదు

ఎమ్మెల్సీ ఐవీ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

కాకినాడ సిటీ, జనవరి 4: ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీలేదని, గొప్పలకు పోయి సంక్షేమ పథకాల పేరుతో అప్పులు చేస్తోందని ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాకినాడలోని ధర్నాచౌక్ వేదికగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేవీవీ నగేష్ అధ్యక్షతన గురువారం ధర్నా శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐవీ మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. భవిష్యత్‌లో మరింత పెద్ద పోరాటానికి యూటీఎఫ్ నాయకత్వం వెనుకాడదని హెచ్చరిక చేశారు. యూటీఎఫ్‌తో, ఉద్యోగ, ఉపాధ్యాయులతో పెట్టుకున్న ప్రభుత్వాలు ఎక్కువ కాలం మనగలగలేదన్నారు. ఈ విషయాన్ని జగన్‌రెడ్డి తెలుసుకుని తక్షణమే డిమాండ్లు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ వెంటనే పెండింగ్ బకాయిలు చెల్లించకపోతే పోరుబాటను మరింత ఉధృతం చేస్తామన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తామని చెబుతున్న ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయి సొమ్ములు విడుదల చేయకుండా తమ స్వార్థానికి, సంక్షేమ పథకాలను వాడుకుంటోందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవిచక్రవర్తి మాట్లాడుతూ ప్రభుత్వం, విద్యాశాఖ నిరంకుశ వైఖరి విడనాడి ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ అంగన్‌వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉద్యోగ ఉపాధ్యాయులు సమ్మెలో ఉంటే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నట్లు ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం ఎంతమాత్రం తగదన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జి.ప్రభాకరవర్మ, కె.సత్తిరాజు, ఎంవీ సాయిరాం, పీవీ రమణ, నాగమణి, ఐ.ప్రసాద్‌రావు, సురేష్‌కుమార్, పీవీవీ సత్యనారాయణ, వీరబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

బైక్ ప్రమాదంలో మరో వ్యక్తి మృతి



స్వామిసతీష్(ఫైల్)

ప్రత్తిపాడు, జనవరి4: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామం వద్ద బుధవారం రాత్రి చెట్టుకు మోటార్ బైక్ ఢీ కొన్న దుర్ఘటనలో తీవ్రంగా గాయపడ్డ 2వ సర్వేయర్ మలిరెడ్డి స్వామి సతీష్(26) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో సంఘటనా స్థలం వద్దే సర్వేయర్ మురళీ అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. తీవ్రంగా గాయపడిన స్వామి సతీష్‌ను అర్ధరాత్రే కాకినాడ జీజీహెచ్ అత్యవసర విభాగానికి తరలించి వైద్యసేవలు అందించినప్పటి బ్రెయిన్ డెడ్ కావడంతో గురువారం మధ్యాహ్నం స్వామి సతీష్ మృత్యువుతో పోరాడి తుది శ్వాస విడిచారు. ఈ ప్రమాదంలో ఇరువురు యువ సర్వేయర్లు మృత్యువాత పడటం జిల్లా రెవెన్యూ యంత్రాంగాన్ని విస్మయ పరిచింది. జరిగిన ప్రమాదంపై పలువురు అధికారులు విచారం వ్యక్తం చేశారు. మురళిది ఏలేశ్వరం కాగా,స్వామి సతీష్‌ది పిఠాపురం మండలం మల్లం గ్రామం. ఈ ఇరువురు ఏలేశ్వరం మండలంలో గత రెండేళ్లుగా సర్వేయర్లుగా విధులు నిర్వహిస్తున్నారు.

కాటన్ బ్యారేజ్ రోడ్డు పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

ధవళేశ్వరం, జనవరి 4: గతుకుల మయంగా మారి, ప్రమాదకరంగా పరిణమించిన కాటన్ బ్యారేజ్ రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. రోడ్డు పనులను తూర్పుగోదావరిజిల్లా కలెక్టర్ మాధవీలత గురువారం పరిశీలించారు. పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షించి పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. హెడ్ వర్క్స్ ఈఈ ఆర్. కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

అందని ద్రాక్షగా ప్రభుత్వ హామీలు



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ముమ్మిడివరం, జనవరి 4: అందని ద్రాక్షగా ప్రభుత్వ హామీలు ఉన్నాయని, దీక్షా శిబిరంలో తాడుకి ద్రాక్ష పండ్ల గుత్తులు కటి వినూత్నంగా నిరసన తెలిపారు నగర పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగులు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ అవుట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మి కులు చేపట్టిన సమ్మె గురువారం నాటికి పదో రోజుకు చేరుకుంది. నగర పంచాయతీ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో తాడుకి ద్రాక్ష పండ్ల గుత్తులను కట్టి, వాటి వంక చూస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసిన వారిని పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కనీస వేతనం అమలు చేయాలని, జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అత్యవసర విభాగాలైన విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులను వారు నిలుపుదల చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు వనచర్ల విజయ్‌కుమార్, న్యాయవాదులు దోనిపాటి ఆంజనేయులు వడ్డి నాగే శ్వరరావు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. సమ్మెలో ఎం.శ్రీనివాసరావు, ఎస్.అరుణకుమార్, వి.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేష్, కాశి రాంబాబు, బి.లోవరాజు, ఎం.భార్గవ్, నాగలక్ష్మి, వెంకటలక్ష్మి, బి.శ్రీను, వై.రమణ, ఎస్.రామరాజు, లక్ష్మి, అర్జావతి తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా పోలవరం గ్రామసభ

కూనవరం, జనవరి 4: కూనవరం మండల కేంద్రంలో నిర్వహించిన పోలవరం గ్రామ సభ రసాభాసగా మారింది. అవార్డు ఎంక్వైరీ సభలో గురువారం క్లస్టరు 1 నుంచి 2 వరకు నిర్వాసితుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అధికారులు ఇచ్చిన పత్రాలలో నిర్వాసితులు సంతకం చేసి ఇవ్వాలని తెలిపారు. అయితే ఆ పత్రాలలో ఎంత పరిహారం ఇస్తారో లేకపోవడంతో నిర్వాసితులు సంతకాలు పెట్టడానికి ముందుగా నిరాకరించారు. పరిహారం ఎంత వస్తుందో తెలియకుండా సంతకాలు పెట్టలేమంటూ నిర్వాసితుల పక్షాన టీడీపీ, జనసేన, సీపీఎం నాయకులు గట్టిగా పట్టుబట్టారు. దీంతో అధికార వైసీపీ నాయకులకు-ప్రతిపక్ష నాయకులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. చివరికి అధికారులు జోక్యం చేసుకుని ఎవరికైనా అభ్యంతరం ఉంటే సంతకాలు చేయవద్దని, అభ్యంతరం లేనివారు సంతకాలు చేయవచ్చంటూ నిర్వాసితులకు తెలిపారు. కొంతమంది సంతకాలు చేయకుండా సభ నుంచి వెళ్లిపోగా మరికొంతమంది సంతకాలు పెట్టి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ అరకు అధికార ప్రతినిధి యడవెల్లి భాస్కరరావు, సీపీఎం నాయకులు నాగరాజు, టీడీపీ మండలం అధ్యక్షుడు బరబాటి ప్రకాష్, జనసేన నాయకులు, కూనవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ హేమంత్‌గాంధీ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బండారు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

- కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె
- పి.గన్నవరంలో విప్లవ గీతాలు ఆలాపన
- ముమ్మిడివరంలో హరిదాసు వేషధారణ

పోలింగ్ కేంద్రాలున్న పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు

ఆత్రేయపురం, జనవరి 4: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయలు కల్పించాలని ఎంపీడీవో నాతి బుజ్జి కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల హెచ్‌ఎంలతో ఆమె సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, ర్యాంపు తాగునీరు సదుపాయాలు కల్పించాలన్నారు. అవసరమైన మరమ్మతులను తక్షణం చేపట్టాలన్నారు. ఎంఈవోలు వరప్రసాద్, సాహెబ్, అధికారులు పాల్గొన్నారు.

హామీల అమల్లో జగన్ ప్రభుత్వం విఫలం: వేగుళ్ల



రాయవరంలో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, జనవరి 4: ఎన్నికల్లోఇచ్చిన హామీలు అమలు చేయడంలో ముఖ్యమంత్రి జగన్ పూర్తిగా విఫలమయ్యారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. గురువారం రాయవరంలో నిర్వహించిన భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం అమలుచేసిన అనేక సంక్షేమ పథకాలు రద్దుచేయడంతో పాటు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలంటే వచ్చే ఎన్నికల్లో తిరిగి టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వానికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ పర్యటించిన ఎమ్మెల్యే చంద్రబాబు ప్రకటించిన 6పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు ఉండవిల్లి రాంబాబు, కోడి చిన్నఅప్పారావు, దేవు వెంకట్రాజు, నేతల సురేష్, నూలు వీరవెంకట సత్యనారాయణ, చల్లా సత్యనారాయణ, కందుకూరి గంగరాజు, వెలుగుబంట్ల గోపీకృష్ణమచ్చా సూర్యారావు, వల్లూరి శ్రీనివాసచౌదరి, మలిపూడి సత్యనారాయణ(చిన్న), వైఆర్కే పరమహంస, మేడపాటి రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మెట్ల జయంతి వేడుకలు



పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న హరీష్, ఆనందరావు, రమణబాబు తదితరులు

అమలాపురం రూరల్, జనవరి 4: మాజీ మంత్రి డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు జయంతిని టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కామనగరువులోని డాక్టర్ మెట్ల స్మృతివనంలో నాయకులు మెట్ల చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తొలుత టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు స్వగృహం వద్దకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి నల్ల వంతెన వద్దనున్న డాక్టర్ మెట్ల విగ్రహానికి టీడీపీ అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులతో కలిసి రమణబాబు పూలమాలలువేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి కామనగరువులోని ఘాట్ వద్దకు చేరుకున్నారు. అనంతరం పేద మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. నాయకులు సతీష్ రాజు, డొక్కా నాథ్‌బాబు, నాగాబత్తుల శ్రీనివాసరావు, అల్లాడ స్వామినాయుడు, మద్దాల సుబ్బారావు, అధికారి జయ వెంకటలక్ష్మి, మాకిరెడ్డి పూర్ణిమ, బత్తుల ప్రసాద్, పిచ్చిక శ్యామ్, రాజులపూడి వెంకటేశ్వరరావు (భీముడు), నల్లా స్వామి, ఆశెట్టి ఆదిబాబు, మంద గెద్దయ్య, పుత్సల వరద రాజులు, మాడా మాధవి, గుమ్మిడి వెంకటేశ్వరరావు, మట్టా మహాలక్ష్మిప్రభాకర్, యేడిద శ్రీను, కుసుమ సూర్యమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే వేదికపైకి రాను



మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

ప్రజా ఉత్సవాల నిర్వహణపై మల్లాడి వ్యాఖ్య

యానాం, జనవరి 4: యానాంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించే వరకు ప్రజాఉత్సవాల స్టేజి ఎక్కేదిలేదని పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. స్వగృహంలో ఏర్పాటుచేసిన కార్యకర్తలు, నాయకులు, అభిమానుల సమావేశంలో అయన మట్లాడారు. యానాంలో పేకాటక్లబ్స్ మూసివేయాలని, మత్స్యకారులకు రావసిన ఓఎన్జీసీ పరిహారం విడుదల చేయాలని, ఇసుక కార్మికులు సమస్యలు పరిష్కరించాలని, అంబేడ్కర్ విజ్ఞాన్ భవన్‌కు రావాల్సిన సీఎస్‌ఆర్ నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తప్పుడు ఫిర్యాదులతో ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడం లేదని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ చర్యలు తీసుకుంటే ఈనెల ఆరో తేదీ నుంచి జరిగే ప్రజాఉత్సవాల వేదికపై కూర్చుంటానని, సమస్యలు పరిష్కరించకపోతే సామాన్యుడిలా గ్యాలరీలో కూర్చుని కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తానని ప్రభుత్వానికి మల్లాడి అల్టిమేటం జారీ చేశారు.

మల్లాడికి శుభాకాంక్షల వెల్లువ

పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు అధికారులు, నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం రాత్రి మల్లాడి యానాం చేరుకున్నారు. గురువారం ఉదయం పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, మున్సిపల్ కమిషనర్ ఆరుల్ ప్రకాశం, సీఐ షణ్ముగం, అధికారులు, నాయకులు, మల్లాడి అభిమాన సంఘ ప్రతినిధులు మల్లాడిని శాలువాలతో సత్కరించి కేక్‌లు కట్‌చేయించి పుష్పగుచ్చాలు అందజేశారు.

హామీలు అమలుచేసే వరకు ఆందోళన



ముమ్మిడివరం: హరిదాసు వేషధారణలో అంగన్‌వాడీల నిరసన

అమలాపురం టౌన్, జనవరి 4: అంగన్‌వాడీలకు జగన్ ఇచ్చిన హామీలను అమలుచేసే వరకు నిరవధిక సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీ సంఘ నాయకురాలు కె.బేబీ గంగారత్నం పేర్కొన్నారు. ఐసీడీఎస్ అమలాపురం ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరం గురువారం 24వ రోజుకు చేరుకుంది. అధికా రులు ఎన్ని బెదిరింపులకు దిగినా వెనుకాడేది లేదన్నారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, తెలంగాణ కంటే మిన్నగా జీతాలు ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. శిబిరంలో ప్రాజెక్టు నాయకురాళ్లు పి.అమూల్య, దైవకృప, విజయ, సీత, కనకమహాలక్ష్మి, నవోమీ, రత్నకుమారి, రుక్మిణి పాల్గొన్నారు.

ముమ్మిడివరం: అంగన్‌వాడీల నిరవధిక సమ్మె గురువారం 24వ రోజుకు చేరుకుంది. ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు శిబిరంలో పాల్గొని హరిదాసు ద్వారా గ్రామాల్లోని లబ్ధిదారు లందరికీ ప్రభుత్వం తమ పట్ల వ్యవహరిస్తున్న వైఖరిని తెలియచెప్పాలని కార్యక్రమాన్ని చేపట్టారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పాదయాత్రలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండు చేశారు. కార్యక్రమంలో ఎస్.దుర్గామహేశ్వరి, ఎం.జయలక్ష్మి, ఎస్.కనక దుర్గ, సుబ్బలక్ష్మి, బి.రమాదేవి, శ్రీదేవి, తలుపులమ్మ, విజయ, కె.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మండపేట: అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె కొనసాగుతుంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల దీక్షలకు పలువురు సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంగన్‌వాడీలు నినాదాలు చేశారు.

పి.గన్నవరం: అంగన్‌వాడీలు గురువారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విప్లవగీతాలు ఆలపించారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి, సీహెచ్ రత్నకుమారి, టి.నిర్మల, రాధ, రమణి, రామలక్ష్మి, కె.అనంతలక్ష్మి, ఎం.శేషవేణి, ఎం.రాజేశ్వరి, కె.పెద్దింట్లమ్మ, టి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు విధులకు హాజరుకాబోమని అంగన్‌వాడీలు తేల్చిచెప్పారు. ఈనెల5 నుంచి విధులకు హాజరు కావాలని ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రతులను ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం దహనం చేశారు. కార్యాలయం ఎదుట మానవహారంగా ఏర్పడి డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఉద్యమాన్నిఅణచివేసే ధోరణిలో ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. అంగన్ వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ గ్రామసభలు

కె.గంగవరం, జనవరి 4: సత్యవాడ, కోటిపల్లి, దంగేరు గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన సభలకు సర్పంచ్‌లు సలాది కళావతి శ్రీనివాసు, కొప్పిశెట్టి వెంకటరమణ, పెమ్మాడి బేబి సత్తిబాబు అధ్యక్షత వహించారు. సభల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించారు. ఈకార్యక్రమాల్లో భారతీయ జనతా పార్టీ నాయకులు సలాది శేఖర్, కాదా వెంకట రమణ, సలాది రామకృష్ణ, బళ్లెం వెంకటస్వామి, బండారు బాబి, సలాది అర్జున, పోలిశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

అంబాజీపేట, జనవరి4: పర్యవరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎస్టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అన్నారు. ఎస్టీయూ వజ్రోత్సవాల్లో భాగంగా లక్ష మొక్కలు నాటే కార్యక్రమం భాగంగా అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్, మండల విద్యాశాఖా కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ బోనం గంగాధర్, ఫ్యాప్టో చైర్మన్ నాగిరెడ్డి శివప్రసాద్, ఎస్‌ఎస్ పల్లంరాజు, జీవీవీ సత్యనారాయణ, సీహెచ్‌వీ సతీష్, షరీఫ్, ప్రకాష్, వజ్రకుమార్ పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఆందోళన

యానాం, జనవరి 4: యానాం ప్రభుత్వాసుపత్రిలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న 42మంది సిబ్బంది బకాయిలు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రెండు రోజులుగా విధులు బహిష్కరించి ఆందోళన చేస్తున్నారు. యానాం ఆరోగ్యశాఖ డీడీ డాక్టర్ టి.రవిశంకర్, ఇతర అధికారులతో పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు చర్చించారు. బకాయి వేతనాలు చెల్లించాలని చర్యలు తీసుకోవాలని అధికారులను మల్లాడి కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు మల్లాడి సత్తిబాబు సిబ్బందికి సంఘీభావం తెలిపారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం



అమలాపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట సంఘ నాయకులతో చర్చిస్తున్న ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు

అమలాపురం టౌన్, జనవరి 4: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ నాయకుడు తొమ్మండ్రు గోపి హెచ్చరించారు. పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 9వ రోజుకు చేరుకుంది. అమలాపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ, సీఐటీయూల సంయుక్త ఆధ్వర్యంలో కార్మికులు సమ్మె శిబిరంలో పాల్గొన్నారు. తొమ్మండ్రు గోపి, నిమ్మకాయల శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె శిబిరానికి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొప్పుల సత్తిబాబు ముఖ్య అతిథిగా హాజరై కార్మికుల సమస్యలపై సంఘ నాయకులతో చర్చించారు. సమస్యల పరిష్కారానికి జేఏసీ కమిటీ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. కార్మికుల దీక్షను సత్తిబాబు ఆధ్వర్యంలో విరమింప చేశారు. దీక్షా శిబిరంలో కొప్పుల బాబి కె.వెంకట్రావు, బండారు బాలకృష్ణ, దంగేటి శ్రీనివాసరావు, రాజేష్, సీఐటీయూ తరుపున పి.కోటేశ్వరరావు, ఎస్.మూర్తి, ఎ.దుర్గాప్రసాద్, సత్తిబాబు, ఎ.బాబి, గూడపు వరలక్ష్మి, అనంతలక్ష్మి, తలుపులమ్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మండపేట: మున్సిపల్ ఒప్పంద పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె కొనసాగుతుంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన టెంట్ వద్ద గురువారం కార్మికులు ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కొంతమంది కార్మికులను రోజువారి వేతనంతో అధికారులు తాత్కాలికంగా పనులు చేయిస్తున్న అధికారుల తీరుపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ పనులను అడ్డుకుంటామని పారిశుధ్య కార్మికులు హెచ్చరిస్తున్నారు.

శంకరగుప్తంలో అగ్ని ప్రమాదం

మలికిపురం, జనవరి 4: శంకరగుప్తంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో రూ.15లక్షలు ఆస్తి నష్టం ఏర్పడింది. నల్లివారిపేటలో గింజేటి వసంతరావుకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈఇంట్లో కిరాణా దుకాణం ఉండటంతో భారీ ఆస్తి నష్టం జరిగినట్టు బాధితుడు తెలిపాడని వీఆర్వో ఎస్.బాలకృష్ణ తెలిపారు. ఈఇంట్లో వసంతరావు సోదరి కూడా నివాసం ఉంటుంది. వైద్యం కోసం ఆమె దాచుకున్న రూ.లక్ష దహనమైంది. అమ్మమ్మను వసంతరావు కాపాడే క్రమంలో ఉన్న వస్తువులను తీసుకోవడంలో జాప్యం కారణంగా నష్టం ఎక్కువ జరిగినట్టు తెలిసింది.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అల్లవరం, జనవరి 4: కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ కోరారు. యెంట్రుకోన, ఓడలరేవు గ్రామాల్లో సర్పంచ్‌లు తిక్కిరెడ్డి శ్రీనివాస్, మల్లాడి మంగాయమ్మ అధ్యక్షతన వికసిత భారత్ సంకల్పయాత్ర సభలు జరిగాయి. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ ఎన్.సత్యనారాయణ, ఏవో ఎస్వీవీ సత్యనారాయణ, ఏపీఎం సయ్యద్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి అడబాల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, జనవరి 4: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఆలమూరుకు చెందిన వైట్ల అనిల్ కృష్ణచౌదరి-నవ్య దంపతులు రూ.1,01,116 విరాళం సమర్పించారు. గురువారం వివిధ సేవల ద్వారా రూ.1,49,356 వచ్చింది.

ఫొటోగ్రాఫర్ల నూతన వెబ్‌సైట్ ప్రారంభం

అమలాపురం టౌన్, జనవరి 4: పోటీ ప్రపంచంలో టెక్నాలజీ ఎంతో అవసరమని, మారుతున్న కాలానికి అనుగుణంగా ఫొటోగ్రాఫర్లు ముందుకు సాగాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. ఫొటోగ్రాఫర్లు తమకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకోవాలన్నారు. జిల్లాలోని ఫొటోగ్రాఫర్లందరికీ ఉపయోగపడే విధంగా రూపొందించిన నూతన వెబ్‌సైట్‌ను గురువారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఐడీకార్డులను సభ్యులకు పంపిణీ చేశారు. జిల్లాలోని ఫొటోగ్రాఫర్లకు కావాల్సిన సహాయ సహకారాలు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా అసోసియేషన్ ద్వారా ప్రతీ నియోజకవర్గంలోను వీడియో కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాశాఖ అధ్యక్షుడు గెద్దం సురేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు మనోజ్, వీఆర్వో టి.సత్యప్రసాద్, సభ్యులు రాజేష్, రమణ, అమలాపురం అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, చింతపల్లి శ్రీను, ఏడుకొండలు, నామాల వెంకటేశ్వరరావు, భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలి

పి.గన్నవరం, జనవరి 4: అమలాపురంలో ఈనెల7న జరిగే సామాజిక సాధికార బస్సుయాత్రను వియజవంతం చేయడానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ కన్వీనర్ ఒంటెద్దు బాబి పిలుపునిచ్చారు. లంకలగన్నవరంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్టాల రామజోగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ పార్టీని బలోపేతం చేయాలన్నారు. రాజశేఖరరెడ్డి కుమార్తె షర్మిళ పార్టీలోకి రావడం శుభపరిణామన్నారు. అనంతరం వంటెద్దు బాబితో పాటు ఏఐసీసీ మెంబర్లు యార్లగడ్డ రవీంద్ర, పీసీసీ జనరల్ సెక్రటరి మహమ్మద్ హరీఫ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరి మాచవరపు శివన్నారాయణ, అమలాపురం కన్వీనర్ వాకపల్లి రాంబాబు, మండల అధ్యక్షులు నెల్లి వెంకటరమణ, అప్పన శ్రీరామకృష్ణ, సమన్వయ కమిటీ మెంబర్లు గంటి ప్రవీణ్‌కుమార్, తెగడా నరసింహమూర్తి, అడ్డగళ్ల నారాయణమూర్తి, అన్నాబత్తుల సత్యనారాయణ, మెల్లెటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లాలో మాదిగలకు ఎమ్మెల్యే సీటు కేటాయించాలి

అమలాపురం టౌన్, జనవరి 4: జిల్లాలోని మూడు అసెంబ్లీ రిజర్వుడు స్థానాల్లో ఒక ఎమ్మెల్యే సీటును మాదిగలకు కేటాయించాలని కోరుతూ మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మాజీ సీఎం చంద్రబాబుకు పొలిటికల్ జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. మాదిగలు టీడీపీ విజయానికి ఎనలేని కృషి చేస్తున్నారని గుర్తుచేశారు. త్వరలోనే జిల్లా పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించే నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు చెప్పినట్టు డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు మోకాటి నాగేశ్వరరావు తెలిపారు. చంద్రబాబును కలిసిన వారిలో మాదిగల పొలిటికల్ జేఏసీ చైర్మన్ చుట్టుగుళ్ల నీలకంఠం, నాయకులు ఆకుమర్తి ఆశీర్వాదం, చెయ్యేటి శ్రీనుబాబు, తొత్తరమూడి ప్రభాకరరావు, నేదునూరి నతానియేలు, మంద వెంకటేశ్వరరావు, ఉందుర్తి సత్యనారాయణ, చాట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

7న కాంగ్రెస్ సమాలోచన సమావేశం

అమలాపురం రూరల్, జనవరి 4: బండారులంకలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ప్రజా సంఘాల సమాలో చన సమావేశాన్ని ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు అధ్య క్షతన గురువారం నిర్వహించారు. ఈనెల7న అమలాపురం ముస్లిం షాదీ ఖానా భవనంలో నిర్వహించే సమాలోచన సమావేశానికి చేయాల్సిన ఏర్పా ట్లను ఏపీసీసీ ప్రధాన కార్యదర్శులు మాచవరపు శివన్నారాయణ, అయితా బత్తుల సుభాషిణి వివరించారు. నాయకులు కుడుపూడి శ్రీనివాసరావు, వాకపల్లి రాంబాబు, గంటి ప్రవీణ్‌కుమార్, దోనిపాటి విజయలక్ష్మి, పులుసుగంటి ప్రకాష్, దొమ్మేటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మురమళ్ళ బ్రిడ్జికి మరమ్మతులు

ఐ.పోలవరం, జనవరి 4: మురమళ్ళ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టారు. అన్నంపల్లి వైపు బ్రిడ్జి రోడ్డు దిగబడి పోవడంతో ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు, బ్రిడ్జి స్లాబ్ మధ్య ఖాళీ ఏర్పడి దిగబడి పోయింది. జాతీయ రహదారి అధికారులు స్పందించి వారం నుంచి మరమ్మతు పనులు చేపడుతున్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

అమలాపురం టౌన్, జనవరి 4: గుడ్ సీడ్ ఫౌండేషన్ ఆర్థిక సాయంతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను గురువారం అమలాపురం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు(ఐవీ) పంపిణీ చేశారు. అమలాపురం పట్టణ, మండల, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో పదో తరగతి పరీక్షలకు సిద్ధపడు తున్న విద్యార్థులు 3వేలమందికి యూటీఎఫ్ ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంచే రమణారావును అభినందించారు. హెచ్‌ఎం వి.విజయకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, ఎంఈవోలు జి.సూర్యప్ర కాశం, కె.కిరణ్ బాబు, డి.నాగసత్యనారాయణ, యూటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ చంద్రకళ, జి.సుబ్రహ్మణ్యం, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

మలికిపురం, జనవరి 4: నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. లక్కవరంలో జలజీవన్ మిషన్ నిధులతో నిర్మించనున్న మంచినీటి ట్యాంకు నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎం.విష్ణుమూర్తి రాజు, దారా సత్తిబాబు, మంగెన సింహాద్రి, కొల్లాబత్తుల అశోక్ పాల్గొన్నారు.

లూయిా బ్రెయిలీ జయంతి

అమలాపురం టౌన్, జనవరి 4: అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో అంధులకు జ్ఞాన కవాటాలను ప్రసాదించిన లూయిా బ్రెయిలీ జయంతిని గురువారం నిర్వహించారు. మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి ప్రమాదవశాత్తూ కంటి చూపును కోల్పోయినప్పటికీ మహిళా క్లబ్‌ను అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలోనే ఉత్తమ క్లబ్ అవార్డు పొందడం పట్ల క్లబ్ తరపున దుశ్శాలువా కప్పి సత్కరించారు. లూయిా బ్రెయిలీ అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ రామాయణం శ్రీనివాసరావును సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి పుత్సా కృష్ణకామేశ్వర్, పచ్చిగోళ్ల రాజా, వలవల వెంకటరెడ్డినాయుడు, తేతల సత్యనారాయణరెడ్డి, సప్పా నాగేశ్వరరావు, కుడుపూడి త్రినాథరావు, రామతులసి పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	హాయ్ నాన్న
వెంకటరమణ	డెవిల్
శ్రీలలిత	బబుల్‌గమ్
శేఖర్ స్క్రీన్-1	సలార్
శేఖర్ స్క్రీన్-2	డంకీ
రమా	డెవిల్
గణపతి	యానిమల్
వెంకటపద్మావతిస్క్రీన్-1	సలార్
వెంకటపద్మావతి స్క్రీన్-2	సలార్

పింఛన్లు పంపిణీ

కపిలేశ్వరపురం: నేలటూరులో గురువారం గ్రామసర్పంచ్ కుక్కల వీరన్న అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో పింఛన్లను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పంపిణీ చేశారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభించారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఆర్‌బీకె సలహా కమిటీ చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, కర్రి పాపారాయుడు, గ్రామ ఉపసర్పంచ్ శనక్కాయల దొరబాబు, ఎంపీటీసీ రుద్రాక్షల వీరగౌరీకుమారి, రుద్రాక్షల శ్రీనివాస్, వేమగిరి శ్రీను, కొప్పిశెట్టి కిషోర్, సిద్దాని రవి, చామకూరి సత్తిబాబు, ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి, వీఆర్వో రాంబాబు పాల్గొన్నారు.

మండపేట: సంక్షేమ పథకాలు పేదలకు ఎంతగానో మేలు చేస్తున్నాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఏడిదలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పింఛన్లను పంపిణీ చేశారు. జడ్పీటీసీ కురుపూడి భవాని, కె.పాపారాయుడు, వైస్ ఎంపీపీ వసుమర్తి నాగేశ్వరరావు, పలివెల సుధాకర్, రామిశెటి శ్రీహరి, ఇన్‌చార్జి ఎంపీడీవో రాజు, పంచాయతీ కార్యదర్శి ఉండమట్ల వీర్రాజు, ఎంపీటీసీలు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ పింఛను కానుక రూ.3వేలను పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గురువారం అందజేశారు. ఎంపీపీ కుండా అన్నపూర్ణ, జడ్పీటీసీ బోణం సాయిబాబా, నాయకులు కనుమూరి శ్రీనివాసరాజు, పాలా నాగేశ్వరరావు, కరుటూరి బ్రహ్మజీ, గాదిరాజు రామకృష్ణంరాజు, బంగార్రాజు, ఎంపీడీవో నాతి బుజ్జి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తపింజరలను పట్టుకున్న స్నేక్ క్యాచర్

కాట్రేనికోన, జనవరి 4: కందికుప్ప పంచాయతీ గరువుపేటలో పంటబోదెలో గురువారం రెండు రక్తపింజరలను స్థానికులు గుర్తిం చారు. స్నేక్‌క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించడంతో ఆయన వాటిని పట్టుకుని సురక్షిత ప్రాంతంలో వదిలేందుకు తీసుకెళ్లారు.

పింఛన్ల పంపిణీపై ఎంపీ బోస్ సమీక్ష

ద్రాక్షారామ, జనవరి 4: పింఛన్ల పంపిణీపై ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ గురువారం సమీక్షించారు. రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త పిల్లి సూర్యప్రకాష్‌తో కలిసి ఆయన ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలతో సమావేశమయ్యారు. రామచంద్రపురం మండలం, పట్టణం పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఒకే చోట నిర్వహించాలని, కాజులూరు, కె.గంగవరం పింఛన్లు పంపిణీ ఆయా మండలాల్లో పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో జరపాలన్నారు కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు మేర్నీడి వెంకటేశ్వరరావు, వనుం సుబ్బారావు, ఎంపీపీలు అంబటి భవానీ, పంపన నాగమణి, డీఎల్‌డీవో శాంతి, ఎంపీడీవో కీర్తి స్పందన, ఈవోపీఆర్డీ షెలత్‌రాజు, కె.గంగవరం, కాజులూరు ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'సోమిశెట్టి' ఫౌండేషన్ సేవలు అభినందనీయం

రాజోలు, జనవరి 4: తాటిపాకలో సోమిశెట్టి ల్యాండ్ మార్కు హోటల్ ఆవరణలో సోమిశెట్టి ఆంజనేయులు, నాగలక్ష్మి ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీసత్యసాయి సేవా సంస్థలు గురువారం ఏర్పాటుచేసిన ఉచిత మల్టీ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు, కొండేటి చిట్టిబాబులు ప్రారంభించారు. సోమిశెట్టి ఆంజనేయులు-నాగలక్ష్మి ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయం దంతవైద్యులు డాక్టర్ వై.చంద్రమౌళి, డాక్టర్ పూజిత, గుండె, షుగర్, ఊపిరితిత్తుల వైద్యుడు డాక్టర్ బి.రాఘవేంద్రరావు, జనరల్ వైద్యులు డాక్టర్ జె.వీరభద్రప్రసాద్, డాక్టర్ కె.ప్రభాకర్, స్త్రీల వైద్యులు డాక్టర్ శారద, చెవి, ముక్కు, గొంతు వైద్యులు డాక్టర్ జి.ప్రభాకర్, ఎముకలు, కీళ్ల వైద్యులు డాక్టర్ కె.రమణ కుమార్, చంటిపిల్లలు, చర్మవైద్యులు డాక్టర్ శ్రీమన్నారాయణలు 545మందిని పరీక్షించి రూ.లక్ష విలువైన ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సోమిశెట్టి ల్యాండ్ మార్కు హెటల్ జేఎండీ సోమిశెట్టి శ్రీనివాస్, జీఎం జనార్ధనరావు, మేనేజర్ ఆర్.సత్యనారాయణ, ఆర్పీ కుమారి, సోమిశెట్టి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. 600మందికి భోజన ఏర్పాట్లు చేశారు.

వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ

రాయవరం, జనవరి 4: వెదురుపాక హైస్కూల్ విద్యార్థులు తాము దాచుకున్న నగదు రూ.25వేలతో పేదలు, వృద్ధులకు చీరలు, పండ్లు అందించారు. సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం పి.రాంబాబు వీటిని పంపిణీ చేశారు. ఐదుగురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. మదర్‌థెరిస్సా సేవాసమితి కోఆర్డినేటర్ కె.శ్రీనివాసగౌడ్, కె.శ్రీనివాస్, పీఈటీ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్ఐ పోస్టుకు ఎంపికైన శ్రీలతకు సన్మానం

ఉప్పలగుప్తం, జనవరి 4: ఎస్ఐ పోస్టుకు ఎంపికైన గ్రామ సచివాలయ మహిళా పోలీస్ కుంచే శ్రీలతను గురువారం ఉప్పలగుప్తం పంచాయతీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి, పంచాయతీ కార్యదర్శి తిక్కిరెడ్డి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిడికుదురు, జనవరి 4: నగరం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8నుంచి 2గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఎం.రవికుమార్ తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా పాశర్లపూడిబాడవ, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

రావులపాలెం: రావులపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. సీఆర్‌సీ, కొమరాజులంక ఫీడర్ల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన చెప్పారు.

జనసేన టికెట్ ఇవ్వాలని దరఖాస్తు

ద్రాక్షారామ, జనవరి 4: రామచంద్రపురం నియోజకవర్గ జనసేన పార్టీ టికెట్‌ను బీసీలకు కేటాయిస్తే తనకు అవకాశం ఇవ్వాలని పెదతాళ్లపొలం గ్రామానికి చెందిన గుత్తుల కృష్ణార్జునులు కోరారు. జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ అధ్యక్షుడు నాదెండ్ల మనోహర్‌ను కలిసి బయోడేటా దరఖాస్తు అందజేసినట్టు తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్‌ను కలిసినట్టు తెలిపారు.

క్రిస్మస్ వేడుకలు

రావులపాలెం, జనవరి 4:మండలంలోని ఈతకోట-గంటి రోడ్డులోని ఒలీవల స్వస్థతశాలలో గురువారం నియోజకవర్గ పాస్టర్స్ జేఏసీ అధ్యక్షుడు పమ్మి అమృతరావు అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీహెచ్ మోజెస్, పీఎస్ఎన్ మూర్తిలతో పాటు జేఏసీ నాయకులు హాజరయ్యారు. కేక్ కట్ చేసి అందరికీ పంచారు.

డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్‌గా ప్రభావతి

అంతర్వేది, జనవరి 4: సఖినేటిపల్లిలంక హైస్కూలులో తెలుగు ఉపాధ్యాయురాలు గండేపల్లి ప్రభావతి క్లస్టర్ కోఆర్డినేటర్ నుంచి డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్‌గా ఎన్జీసీ డైరెక్టర్ పి.స్రవంతి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. పర్యావరణం పట్ల బాధ్యత మరింత పెరిగిందని, పరిసరాల పరిశుభ్రత, పచ్చని మొక్కల పెంపకానికి జిల్లా వ్యాప్తంగా కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటికే ఓజోన్‌డే, ఫ్రెండ్లీ వినాయక, ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం వంటి అనేక కార్యక్రమాల ద్వారా జిల్లాలో అనేక పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించినట్టు ప్రభావతి తెలిపారు.